5,172 మందికి 'కాపునేస్తం'

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో నాలుగో విడత కాపునేస్తం ద్వారా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అర్హులైన 5,172 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.7.75 కోట్ల జమ చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. కాపునేస్తం వర్చువల్ కార్యక్రమానికి కలెక్టరేటులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఏటా రూ.15 వేలు వంతున ఐదేళ్లకు రూ.75 వేలు అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ హైమావతి, బిసి, కాపు కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.గెడ్డమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారేరి?

- పేలవంగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం
- మంత్రులు, ముఖ్య నాయకుల డుమ్మా
- జిల్లాలోనే ఉన్నా సమయం వెచ్చించని ప్రజాప్రతినిధులు
- సభ్యులు లేవనెత్తిన సమస్యలకు భరోసా కరువు

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో కరువుపై ఒక సమగ్రమైన చర్చ ఉంటుందని అంతా భావించారు. వీటితో పాటు నీటిపారుదల, విద్య, వైద్య శాఖలు, నాడు-నేడు పనులు, విద్యుత్, రోడ్లు వంటి సమస్యలపై సమీక్ష ఉంటుందని, అందులో తమ ప్రాంత సమస్యలను చెప్పుకోవచ్చని జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చారు. వారి ఆశలపై నీళ్లు చల్లేలా మంత్రులు, అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు వ్యవహరించారు. జిల్లాలో ఉండి సమావేశానికి డుమ్మా కొట్టారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చే వారే కరువయ్యారు. జిల్లా పరిషత్ పాలకవర్గం రెండున్నరేళ్ల పాలనలో అత్యంత పేలవంగా సాగిన సమావేశంగా విమర్శలపాలైంది.

జెడ్‌పి సర్వసభ్య సమావేశం శనివారం జెడ్‌పి నూతన సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.45 గంటలకు ప్రారంభమైంది. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సెలవు పెట్టడంతో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ మాత్రమే వేదికపై కూర్చొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ రాలేదు. దీంతో జెడ్‌పి చైర్‌పర్సన్ సమావేశం మొదలుపెట్టారు. తొలుత విద్యాశాఖపై సమీక్షను ప్రారంభించారు. సరుబుజ్జిలి జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ మండలంలోని రాయివలసలో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే, మతలబుపేటలో పిల్లలు లేని చోట ఐదు అదనపు గదులకు నాడు-నేడు నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఎపిసి ఆర్ జయప్రకాష్ ఇచ్చిన సమాధానంతో ఆయన సంతృప్తి చెందలేదు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉంటే ఈ సమస్యకు సరైన పరిష్కారం దొరికేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కంచిలి జెడ్‌పిటిసి పి.దేవదాస్‌రెడ్డి విద్యా సంవత్సరం మధ్యలో బదిలీల వల్ల జలంత్రకోటలో ఒరియా ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరిగాయని విద్యాశాఖ అధికారులు, ఇన్‌ఛార్జి కలెక్టర్ బదులు ఇచ్చినా ఆయన సంతృప్తి చెందలేదు. విద్యాశాఖ మంత్రి గానీ జిల్లాకు చెందిన మంత్రులు గానీ ఉంటే అక్కడ ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఇచ్చే ఉండేవారని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నాలుగు శాఖలపై చర్చతో సరి

తమ మండలానికి చెందిన ఒక ఫీల్డ్ అసిస్టెంట్ జలుమూరులో యువచైతన్య యాత్రను తానే దగ్గర ఉండి నిర్వహించారని, మరో ఫీల్డ్ అసిస్టెంట్ మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి పాల్పడ్డారని, రెండు పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు బదులిస్తూ షోకాజ్ నోటీసులు ఇచ్చామని వారిచ్చిన సమాధానం చూసి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. ఇదే అంశంపై మంత్రుల రియాక్షన్ వేరే విధంగా ఉండేదని, చర్యలకు సిఫార్సు చేసే వారనే సభ్యుల మధ్య చర్చ నడిచింది. నీటిపారుదలశాఖపై ఐదు నిమిషాల్లోనే ముగించారు. వంశధార, తోటపల్లి, నారాయణపురం ద్వారా ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారు? సమస్యలేమిటనే అంశాలపై కనీస చర్చ జరగలేదు. వ్యవసాయశాఖపై కొంతమేర చర్చ జరిగినా జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల సాగుపై ఎవరూ అడగలేదు. ఒక్క కంచిలి జెడ్‌పిటిసి దేవదాస్‌రెడ్డి మాత్రం మండలంలో పంటలు ఎండిపోయిన అంశాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మొత్తమ్మీద నాలుగు ప్రభుత్వ శాఖలపై సమీక్ష చేసి 2.15 గంటలకే ముగించేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కంబాల జోగులు, వి.కళావతి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలోనే ఉన్నా సమయం వెచ్చించని ప్రజాప్రతినిధులు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు జిల్లాలోనే ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఫాజుల్‌బేగ్‌పేటలో నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో పాత్రునివలసలో ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. గార మండల కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన పోషణ మహోత్సవాల్లో పాల్గొన్నారు. పశుసంవర్థక మంత్రి సీదిరి అప్పలరాజు ఉదయం పది గంటల వరకు నియోజకవర్గంలో పలుచోట్ల ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటలకు పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 15న విజయవాడ వెళ్లి శనివారం నాలుగు గంటలకు విజయనగరం వచ్చారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉదయం పది గంటలకు బూర్జ మండలం చిన్నలంకాం, మామిడివలసలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి శంకుస్థాపనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ధర్మాన కృష్ణదాస్ ఉదయం తొమ్మిది గంటలకు పోలాకి మండలం చెల్లాయివలస సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. తర్వాత సారవకోట మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశం షెడ్యూల్‌ను మంత్రులు, ముఖ్య ప్రజాప్రతినిధుల వెసులుబాటు బట్టే నిర్ణయిస్తారు. సమావేశం తేదీ నిర్ణయించిన తర్వాత కూడా సర్వసభ్య సమావేశానికి సమయం వెచ్చించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

20 నుంచి ఉక్కు రక్షణ యాత్ర

జయప్రదం చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్ యాత్రను ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం తెలిపారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్ర 20న విశాఖపట్నంలో ప్రారంభమై 22న ఎచ్చెర్ల చేరుకుంటుందన్నారు. 22, 23 తేదీల్లో జిల్లాలో బైక్ యాత్ర సాగుతుందని తెలిపారు. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట మీదుగా ఇచ్ఛాపురం వెళ్లి మందస, పాతపట్నం, కొత్తూరు మీదుగా సాగుతుందని వివరించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో సుమారు 1200 కిలోమీటర్లు సాగి 29వ తేదీన స్టీల్‌ప్లాంట్ వద్ద చేపడుతున్న నిరాహారదీక్ష శిబిరం వద్దకు చేరుకుంటుందని చెప్పారు. యాత్ర ముగింపు సందర్భంగా 29న సాయంత్రం ఐదు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్ర ప్రారంభానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ముగింపు సభకు అఖిల భారత నాయకులు హాజరవుతారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, రాబోయే కాలంలో పెద్దఎత్తున ప్రతిఘటన తప్పదనే హెచ్చరిక ఈ యాత్ర ద్వారా ఈ ప్రాంత ప్రజలు చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, అధిక ధర చెల్లించి ఇనుప ఖనిజాన్ని కొంటున్నా ఛత్తీస్‌ఘడ్‌లోని ఎన్‌ఎండిసి నుంచి కొనుగోలుకు అనుమతించడం లేదన్నారు. దూర ప్రాంతంలోని కర్నాటక నుంచి కొనుగోలు చేసుకోవాలని చెప్పడం స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టాలన్న కుట్రలో భాగమేనన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి సరుకులు అన్‌లోడ్ చేయకుండా పక్కనే ఉన్న అదానీకి చెందిన గంగవరం పోర్టు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పాలకుల మెడలు వంచి పోరాడి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను తిరిగి అటువంటి పోరాటాల ద్వారానే రక్షించుకోవడం సాధ్యమన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్తరాంధ్ర ప్రజలు సహించేది లేదని స్పష్టం చేశారు. తెలుగు ప్రజలు పోరాడి 32 మంది ప్రాణ త్యాగాలతో, 16 వేల మంది రైతుల త్యాగఫలంగా సాధించుకున్న ప్లాంట్‌ను రక్షించుకుని తీరుతామన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద పరిశ్రమగా ఉండి రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇటువంటి సంస్థను కాపాడుకోవడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమన్నారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులిపేసుకుందన్నారు. రాష్ట్ర ప్రజలను సమీకరించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కనీస ప్రయత్నం కూడా చేయలేదని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్రకు రావాల్సిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, మెట్రో రైలు, రైల్వేజోన్, విద్యాసంస్థల నిర్మాణం నేటికీ ఆచరణ రూపం దాల్చలేదన్నారు. ఈ దిశలో ఉత్తరాంధ్ర ప్రజలను చైతన్యపరచడానికి ఈ యాత్ర చేపట్టామని తెలిపారు.

చంద్రబాబు నిజాయతీపరుడా?

రూ.371 కోట్లు దోచుకుతిన్నారు : మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్మనీలో ఉండే కంపెనీ (సీమెన్స్) పేరు చెప్పి రూ.371 కోట్లు దోచుకున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. గార ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. దర్యాప్తు సంస్థలే దీన్ని నిర్ధారించాయన్నారు. రానున్న కాలంలో ఇంకా ఎన్ని బయటపడతాయో చూడాలని చెప్పారు. లోకేష్ తన తండ్రి నిజాయతీపరుడని చెప్తున్నాడని, ప్రజలు దీన్ని నమ్మేందుకు అమాయకులుగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ దొంగలను దేశంలో ఉండే కీలక దర్యాప్తు సంస్థలు విచారణ చేసి పట్టుకున్నాయన్నారు. వీరికి అనుకూలంగా ఎల్లో మీడియా రోజుకో కథనం తీసుకొచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. శక్తివంతమైన తరం రూపకల్పన తల్లి తర్వాత అంగన్వాడీ కార్యకర్తలే కీలకమని, పరిమిత సంతానం కలిగిన కుటుంబాలు అన్ని సదుపాయాలు కలిగి ఉంటారని సూచించారు. అందువల్ల ఆ దిశగా ప్రజల ఆలోచనల్లో మార్పులు రావాలన్నారు. జిల్లాలో ఉన్న రూరల్ ప్రాజెక్టులలో గార ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

మంచి ఫలితాలు ఇచ్చే ప్రక్రియలో ముందున్న కార్యకర్తలు చిన్నారులపై అదే శ్రద్ధను కొనసాగించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పర్యటన చేసినప్పుడు ప్రజలకు చక్కటి జీవనం అందించాలని భావిస్తుంటామని, అక్కడ నదుల్లో మురుగు అన్నది ఎక్కడా కనిపించదన్నారు. ఇక్కడా పౌరులు బాధ్యతగా మెలగాలన్నారు. గార సిడిపిఒ రాధ మాధవి అధ్యక్షతన కార్యక్రమంలో జిల్లా మహిళాశిశు సంక్షేమ అధికారి బి.శాంతిశ్రీ, ఎంపిపిలు అంబటి నిర్మల శ్రీనివాస్, గొండు రఘురాం, జెడ్‌పిటిసిలు రుప్ప దివ్య, మార్పు సుజాత, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'స్పందన' లేదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈనెల 18న వినాయక చవితి సెలవు దినం సందర్భంగా స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నీచ రాజకీయాలకు కేరాఫ్ అప్పలరాజు

మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శివాజీ

ప్రజాశక్తి - పలాస

నీచ రాజకీయాలకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ విమర్శించారు. అందులో భాగంగానే రిలే నిరాహార దీక్షను పోలీసులను అడ్డం పెట్టుకుని భగ్నం చేయించారని ధ్వజమెత్తారు. కాశీబుగ్గలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ స్థలంలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేపడుతుంటే మంత్రి అప్పలరాజు చిన్న ఫోన్ కాల్‌తో పోలీసులు రెచ్చిపోయి విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏం జరిగిందో కాల్ డేటా దమ్ముంటే బయట పెట్టగలరా అని ప్రశ్నించారు. మంత్రి అరాచకానికి పోలీసులు వత్తాసు పలుకుతూ వ్యవస్థను నాశనం చేస్తున్నారని విమర్శించారు. తనను అరెస్టు చేసి ఎక్కడకు తీసుకెళ్తున్నారో తనకే చెప్పలేదని, కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు. రహస్యంగా తీసుకు వెళ్లాల్సిన అవసరం ఏం వచ్చిందో చెప్పాలన్నారు. ఎందుకు అరెస్టు చేశారని పోలీసులను నిలదీస్తే ఉన్నతాధికారుల ఆదేశాలని ముక్తసరిగా చెప్పారన్నారు. ఐపిఎస్, గ్రూప్-1 స్థాయి అధికారులు శిక్షణ పొంది నీచ రాజకీయాలు చేస్తున్న వారికి అండగా నిలవడానికా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో శివాజీ సతీమణి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు పాల్గొన్నారు.

నాలుగో రోజు దీక్షలు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన నాలుగో రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివాజీ సతీమణి విజయలక్ష్మి మందస మండల టిడిపి నాయకులు కార్యకర్తలకు నల్ల కండువాలు వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతు శివాజీ, గౌతు శిరీష మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. అనంతరం గౌతు శిరీష దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మందస మండల అధ్యక్షులు బావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మండల ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో చేనేత క్లస్టర్‌కు పరికరాలు

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.ఎం నాయక్

ప్రజాశక్తి - పొందూరు

ఫ్రేమ్‌లూమ్ మీద జాక్వార్ ఫ్యాబ్రిక్‌తో అధునాతన చీరలు నేసేందుకు అవసరమైన శిక్షణను చేనేత కార్మికులకు అందించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ ఎం.ఎం నాయక్ అన్నారు. పొందూరు పట్టణంలో సాయిబాబా చేనేత సొసైటీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 74 చేనేత క్లస్టర్లు ఉన్నాయని తెలిపారు. ఫిట్‌లూమ్ నుంచి ఫ్రస్ట్రమ్ లూమ్‌కు కార్మికులు అప్‌డేట్ కావాలన్నారు. పొందూరులో నూతనంగా ఏర్పాటు చేసిన చేనేత క్లస్టర్‌కు అవసరమైన అన్ని పరికరాలను రెండు నెలల్లో సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సొసైటీలు బలపడాలంటే సభ్యత్వం పెరగాలని, తద్వారా ఉత్పత్తి పెరిగి అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం ఉన్న చేనేత వస్త్రాల టర్నోవర్‌ను రెండింతలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేనేత వస్త్రాల విక్రయం రిబేటు బకాయిల సుమారు రూ.3.96 లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని సాయిబాబా చేనేత సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ బిల్డింగ్ పూర్తయి నాలుగేళ్లయినా వినియోగంలోకి రాలేదని, పరికరాలు ఇవ్వలేదని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఎడి ఐ.ధర్మారావుకు ఆదేశించారు. 50 ఏళ్లు దాటిన వారందరికీ పింఛన్లు అందుతున్నాయని అడగ్గా, ఎం.గవ్రాజు తనకు ఫించన్ రావడం లేదని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మంజూరు కావడం లేదని తెలిపారు. అనంతరం సొసైటీలోని చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈయనతో పాటు ఎడి ధర్మారావు, డిఒ శేఖర్, ఆప్కో డిఎం సోమేశ్వరరావు, సంఘం డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ గాలి ఎటువైపు...?

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా మలుపు తిరిగాయి. జిల్లా రాజకీయాల్లో సరికొత్త ఆలోచనలకు, సమీకరణలకు శ్రీకారం చుట్టే పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు అరెస్టుతో ప్రజల్లో ఉప్పెనలా నిరసనలు ఉంటాయని ఆ పార్టీ సీనియర్లు ఆశించారు. టెక్కలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న జిల్లాలో ప్రజల్లోనే కాదు, పార్టీ కార్యకర్తల్లోనూ కనిపించలేదు. రోడ్డెక్కడానికి పోలీసులు అవకాశం ఇవ్వడం లేదని, గృహ నిర్బంధాల్లో ఉన్నామని పలువురు నేతలు చెప్పుకునే పరిస్థితిని చూశాం. పార్టీ వర్గాల ప్రకారం జిల్లాలో సుమారు 50 వేల సభ్యత్వం టిడిపికి ఉంది. గడిచిన నాలుగు రోజులుగా ఐదారు వేలకు మించి కార్యకర్తలు కదలి రాలేదని తెలుస్తోంది. చంద్రబాబు అరెస్టు తర్వాత జిల్లావ్యాప్తంగా పోలీసులు వంద మందిని గృహ నిర్బంధం చేశారు. చంద్రబాబు అరెస్టు తర్వాత కార్యకర్తలకు ఇంతకంటే ప్రాధాన్యత ఏముందని రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో చెప్పారు. ఆయన అన్న మాటల్లోనే నిరసనల్లో స్పందన కనిపించలేదన్నది స్పష్టమైంది. కార్యకర్తల సమీకరణ కనిపించలేదని, ఇదే విషయాన్ని బయటవారు తనను అడుగుతుంటే చాలా బాధపడ్డానని చెప్పారు. ఇంత ఆందోళన వ్యక్తం చేసిన అచ్చెన్నాయుడు, ఆయన నియోజకవర్గంలోని టెక్కలిలో బంద్ రోజు రోడ్లపై 20 మందికి మించి రాలేదని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. దీక్షా శిబిరంలోనూ వంద మందికి మించి కనిపించలేదు. టెక్కలిలో బంద్ నిర్వహణ, రిలే దీక్షలు పేలవంగా జరిగాయని ఆ పార్టీ నాయకులు అంగీకరిస్తున్నారు. టిడిపికి గత ఎన్నికల్లో జిల్లాలో 35 శాతం ఓట్లు లభించాయి. ఈసారి విజయం తమదేనని చెప్పుకుంటున్న తరుణంలో చంద్రబాబు అరెస్టుతో కార్యకర్తలు, నేతలు కొంత డీలా పడినట్లు స్పష్టంగా వెల్లడైంది. మరోవైపు అరెస్టు మరింత సానుకూలమవుతుందని టిడిపి నేతలు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు అరెస్టుతో డీలా పడిన కార్యకర్తలను, నేతల్లో ఉత్సాహం నింపడానికి టిడిపితో జనసేన కలిసి వెళ్తుందని ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చిందని జిల్లాలోని ఆ పార్టీ సీనియర్లు చెప్తున్నారు. ఈ సానుభూతి గాలి జిల్లాలో ఎటువైపు వస్తుందో చూడాల్సి ఉంది. అచ్చెన్నాయుడు నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఓ నేత సమీకరణలో ఇబ్బందుల సమస్యలను చెప్తున్నప్పుడు అవన్నీ ఇప్పుడెందుకు ఎవరైనా వీడియో చేసి వైరల్ చేస్తారని చెప్పడం విశేషం. అరెస్టు, జైలు తమకు సానుకూలమన్న మాట ఆ పార్టీ జిల్లా నేతల నుంచి వినిపిస్తోంది తప్ప వారిలో ఈ చర్యలపై ఆవేశం, ఆక్రోశం కనిపించడం పాక్షికంగా ఉంది. బెయిల్ నిర్ణయం తేలే వరకు జిల్లాలో టిడిపి కార్యక్రమాల్లో ఎటువంటి పురోగతి ఉండదని నేతలు చెప్పే పరిస్థితి ఉంది.



జనసేనలో చలనం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం రాకుండా హైదరాబాద్‌లో నిరోధించడాన్ని నిరసిస్తూ ఆయన రోడ్డుపై పడుకున్నారు. ఆ చర్యకు గానీ చంద్రబాబు అరెస్టుకు గానీ జిల్లాలో జనసేన అభిమానుల్లో చలనం రాలేదు. ఎక్కడా రోడ్డెక్కలేదు. నిరసనలు చేపట్టలేదు. టిడిపితో కలిసి ఎన్నికలకు వెళ్తామని పవన్ ప్రకటించిన తర్వాతనే జిల్లాలో వారిలో కదలిక వచ్చినట్లు కనిపించింది. టిడిపి కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్నారు. అయితే, జిల్లాలో ఆ పార్టీకి బలమెంత అన్నది గత ఎన్నికల్లో చూశాం. అంగ బలం, అర్థ బలం ఉన్న నాయకులు కానరాలేదు. చెప్పాలంటే ఆ పార్టీకి జిల్లాలో నేటికీ నాయకుడినే నియమించలేదు. జనసేన, టిడిపి చెలిమి జిల్లాలో గాలివాటం ఎటువైపు వీస్తుందో చూడాల్సి ఉంది.

దాన్నేమంటారు!

జిల్లాలో వైసిపి రాజకీయాల్లో టెక్కలి ఆశావహుల సంఖ్య ఒకవైపు ఆధిపత్య పోరు గ్రూపుల గోల ఆ పార్టీకి వెన్నంటే ఉంది. గ్రూపుల గోలలోని నియోజకవర్గ కేంద్రాల్లోనూ మండలాల్లోనూ ప్రత్యేక కార్యాలయాలు వెలుస్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలో రెండేళ్ల నాడే సువ్వారి గాంధీ నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నంలోనూ మరోవైపు కొత్తూరులోనూ ప్రత్యేకంగా పార్టీ కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. గోగుల వరప్రసాద్ ఆధ్వర్యాన మామిడి శ్రీకాంత్ ఈ కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిసింది. విచిత్రమేమిటంటే నరసన్నపేట నియోజకవర్గం సారవకోటలో జిల్లా అధ్యక్షులే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం విశేషం. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పార్టీ కార్యాలయాలను ప్రారంభించడం సర్వసాధారణం. ఇంత ముందస్తుగా సారవకోటలో ప్రారంభించడం కుటుంబ రాజకీయాలే కారణమని తెలుస్తోంది. ఆయన మేనల్లుడు చిన్నాల కూర్మినాయుడుతో ఉన్న భేదాభిప్రాయాలు కారణంగానే సారవకోటలో ముందస్తుగా వెలిసిందని చెప్తున్నారు. చిన్నాల కూర్మినాయుడు కూడా నరసన్నపేటలో పోటీగా కార్యాలయాన్ని ప్రారంభించనున్నారన్నది విస్తృతంగా ప్రచారం సాగింది. ఆయన నేటివరకు అందుకు సిద్ధం కాలేదు. నరసన్నపేట, ఆమదాలవలసలో ఎగిరే పిట్టకు మసాలా సిద్ధం చేసుకుంటున్న చందంగా ఉందని వ్యంగ్య వ్యాఖ్యానాలు చేసే పరిస్థితి పార్టీలోనే ఉంది. ఎంపీ అభ్యర్థులుగా తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్ పేర్లు బాగా వినిపిస్తున్నందున అప్పుడు తామే ఎమ్మెల్యే అభ్యర్థులమవుతామన్న భావనలో వారున్నట్లు ప్రచారంలో ఉంది. ఇచ్ఛాపురంలో మరో విచిత్రమైన పరిస్థితి ఉంది. అక్కడ ప్రధాన పార్టీలకు కాకుండా ఇతర పార్టీలకు కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్యంగా వైసిపికి బహు నాయకత్వంతో పాటు టిక్కెట్ల ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. అందువల్ల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తే నిర్వహణా భారం ఎవరు చూడాలి. టిక్కెట్ రాకుంటే చేతులు కాల్చుకోవడమే అవుతుందని ఎవరికి వారు భావిస్తున్నట్లు తెలిసింది. అందుకే ఎవరూ పార్టీ కార్యాలయం ఆలోచన చేయకుండా ఇళ్లే కార్యాలయాలుగా ఉన్నాయని చెప్తున్నారు.

CHANGE OF NAME

I, Undersigned **ALLU APPA RAO** (New Name),S/o. Ramachandrarao, Residing of 4-35, Main Street, Tekkali, Ayyappa Nagar, Tekkali, Srikakulam Dist, AP-532201. I have changed my name & surname from **RAO.A.APPA (OLD NAME)** to **ALLU APPA RAO (NEW NAME),** S/o. Ramachandrarao for all purpose.

బహిరంగ ప్రకటన

★ కోటబొమ్మాళి మండలం, రేగులపాడు గ్రామం, మెయిన్వీధి, ఇంటి నెం.1-312లో నివాసము ఉంటున్న పట్ట లక్ష్మీకాంతమ్మ W/o అప్పన్న, మారుపేరు పల్లి రాధ W/o అప్పన్న అను నేను సవరడ్డపనసలో పాలసీ నెం.R-AP.VP-EA-398773 సంఖ్యతో జీవితబీమా పాలసీ కలిగిఉన్న వివాహం అనంతరం పట్ట లక్ష్మీకాంతమ్మగా ఉన్న పేరును పల్లి రాధగా మార్చుకుని పిలవబడుతున్నాను. దయచేసి గమనించగలరు.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ICHAPURAM OS.3/2021

Between:
Rangala Murali --Plaintiff
And:
Buddupu Balakrishna --Defendant

To,
Buddupu Balakrishna, s/o Bheemayya, aged 37 years,r/o Main Road, Haripuram Village,Ichapuram Mandalam, Srikakulam District, A.P.

NOTICE

Please take notice that the above named Plaintiff filed the above suit before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram against you for recovery of suit amount and the matter is posted to **21-09-2023** for your appearance before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram at **10.30 A.M.** on the said date in person or through your Counsel or else the matter will be decided in your absence.

SRI BHAGAVAN DAS,
Advocate,
Ichapuram,
Srikakulam District.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ICHAPURAM OS.11/2021

Between:
Dumpa Latchayya --Plaintiff
And
Buddupu Balakrishna --Defendant

To,
Buddupu Balakrishna, s/o Bheemayya, aged 37 years,r/o Main Road, Haripuram Village,Ichapuram Mandalam, Srikakulam District, A.P.

NOTICE

Please take notice that the above named Plaintiff filed the above suit before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram against you for recovery of suit amount and the matter is posted to 21-09-2023 for your appearance before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram at 10.30 A.M. on the said date in person or through your Counsel or else the matter will be decided in your absence.

SRI BHAGAVAN DAS,
Advocate
Ichapuram,
Srikakulam District.

అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పలాస

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి, ఆ సంఘం జిల్లా నాయకులు ఆదినారాయణ మూర్తి, తెప్పల సింహాద్రి డిమాండ్ చేశారు. శనివారం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలను అందించాలని, వెల్ఫేర్ బోర్డ్ ద్వారా అందించే సేవలు తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు బోర్డ్ నిధులు తిరిగి వెల్ఫేర్ బోర్డ్‌కు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డ్ ద్వారా వసూళ్లు చేసిన నిధులు కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా మంత్రి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.చంద్రరావు, జి.గోవింద్, దుర్యోధన, కోక్లి మేస్త్రీ, డి. గోవింద్ , రాము, పి రామకష్ణ, పలాస వజ్రపుకొత్తూరు మందస మండలాల కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

పొందూరు : మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 214 మంది విద్యార్థులకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. తాడివలస పిహెచ్.సి వైద్యులు డాక్టర్ జి.రమేష్ నాయుడు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అనసూయ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలున్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, హెల్త్ ఇన్స్పెక్టర్ పైడి తవిటిరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు తర్లాడ రాజశేఖరరావు, పి.శ్రీనివాసరెడ్డిలు శనివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన సేవల్లో పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాలను కప్పి ఆలయ ఇఒ హరి సూర్యప్రకాష్ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్‌సి, ఎస్‌టి జడ్జి ఫణికుమార్, జూనియర్ సివిల్ జడ్జి శారదంబ, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సన్యాసినాయుడు, వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ అడ్డగింత

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో పలాసలో చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీని కాశీబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టిడిపి నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గౌతు శిరీషతో పాటు టిడిపి నాయకులు పలాస టిడిపి కార్యాలయం నుంచి ఇందిరా చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేసేందుకు సిద్ధమయ్యారు. జూనియర్ కళాశాల వరకు ర్యాలీ వచ్చే సరికి కాశీబుగ్గ రూరల్ సిఐ శంకర రావుతోపాటు సిబ్బంది ర్యాలీని అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ర్యాలీ ఎలా చేస్తారంటూ గౌతు శిరీషను ప్రశ్నించారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తూంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ర్యాలీ చేసేందుకు వీలు లేదని సిఐ చెప్పడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు వెనుదిరిగారు.

ఆమదాలవలసలో 'నేను సైతం' రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులు పట్టణంలో ర్యాలీ తీయడానికి ప్రయత్నించగా పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నూకరాజు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచులు బొడ్డేపల్లి గౌరీపతిరావు, గొండు రమణ, సనపల చెల్లం నాయుడు, ఎండ అప్పలనాయుడు, నేతింటి జ్యోతీశ్వరరావు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలుమూరు మండలం మండలం చల్లవానిపేట

కోటబొమ్మాళి : కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పలాస : పోలీసులతో గౌతు శిరీష వాగ్వివాదం

గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చల్లవానిపేట గ్రామంలో ప్రారంభించిన ఈ ర్యాలీ జంక్షన్ వరకు నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడుతోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం పక్కన టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు తదితరులు రిలేనిరాహారదీక్ష చేపట్టారు. చంద్రబాబు మద్దతుగా కొత్తపేటకు చెందిన కింజరాపు యువసేన సభ్యులు, యువకులు వారి రక్తంతో సంతకాలు చేసి నిరసన తెలిపారు. దీక్షలో టెక్కలి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, తెలుగు యువత మహిళ అధ్యక్షులు పూజారి శైలజ, ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, మాజీ ఎంపిపి త్రర రామకృష్ణ పాల్గొన్నారు. ఈ రిలేనిరాహారదీక్షకు న్యాయవాదు కింజరాపు అచ్చెన్నాయుడు, సాయిరాజ్, రెయ్యి ప్రభుచంద్ర, భుజంగరావు, మూర్తి, సూర్యరాజు మద్దతు తెలిపారు.

మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడి రాము, బాదాం రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు కొనసాగింది. ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యాన సంతకాల సేకరణ నిర్వహించారు. శనివారం జరిగే రిలే నిరాహార దీక్షలో సోంపేట మండలానికి చెందిన టీడీపీ నేతలు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కొండ శంకర్ రెడ్డి, నందిక జాని, కాళ్ల జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టిడిపి అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, గార మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, కార్యదర్శి సాధు జయరాందాసు నాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు బలగ చెంగాలరావు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి సాధు శ్రీను, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాదిగ, డివిజన్ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు యాదవ్, కేశవ రాంబాబు, రోణంకి కళ్యాణ పాల్గొన్నారు. అనంతరం నగరంలోని పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని సందర్శించారు.

కొత్తూరు మండలం టి.డి.పి.నాయకులు రోజు రిలే నిరాహారదీక్షలో మేము సైతం బాబు వెంట ఉన్నామంటూ దీక్షలో పాల్గొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు అన్నారు. ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం - ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం ప్రధాన కార్యదర్శి దొంకాన ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు కూన అన్నంనాయుడు, ఆగూరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజల్లో మరింత చైతన్యవంతంతో ముందుకొచ్చి కాపాడాలన్నారు. న్యాయవాది బి.మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం సాధ్యపడిందన్నారు. కానీ, ఆ సామాజిక న్యాయం ప్రమాదంలో పడిందని ఆవేదన

మాట్లాడుతున్న సూర్యారావు

వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిసి న్యాయవాద సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, ఐలు జిల్లా అధ్యక్షులు దుంపల రమణారావు, ఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పైడి లక్ష్మీపతి, దొంకాన ఈశ్వరరావు, చక్రధర్, సువ్వారి వెంకటరమణ, సూర అప్పలనాయుడు, డి.ఇంద్రనాగమోహన్, చలపతిరావు, గౌరవ అధ్యక్షులు అంధవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బెంతులకి ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నివసిస్తున్న బెంతు ఒరియా కులస్తుల ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మంజూరు కావడంతో వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్, వార్డ్ కౌన్సిలర్ తాడి ఆది రెడ్డి. హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా బెంతు ఒరియా కులస్థులకు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ కాకపోవడం వల్ల ఎంసెట్, ఏపీ సెట్, పోలిసెట్ చేస్తూ చదవుతున్న విద్యార్థులు అనేక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు విద్యా దివెన, వసతి దీవెన లాంటి అనేక సంక్షేమ పథకాలు కూడా రాకపోవడంతో ఈ విషయాన్ని ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ దృష్టికి కుల పెద్దలు, యువతతో కలసి తీసుకొని వెళ్లామని అన్నారు. శ్రీకాకుళం జిల్లా బెంతు ఒరియా సంఘం తరపున పిరియా సాయిరాజ్‌కి కతజ్ఞతలు తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి, బెల్లుపడ బెంతు ఒరియా విద్యార్దులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను మండల తహశీల్దార్ గురుప్రసాద్, వార్డ్ కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- నందిగాం

భాగ్యలక్ష్మి మృతదేహం

మండలంలోని పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన కూర్మాపు భాగ్యలక్ష్మి (17) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన మృతురాలి తండ్రి కూర్మాకు విష్ణుమూర్తి ఫిర్యాదు మేరకు తరచూ బలమైన కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదని, అది తట్టుకోలేక శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. భాగ్యలక్ష్మి ప్రస్తుతం నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపిసి సెకండియర్ చదువుతోంది. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఎంపికలు నిర్వహిస్తున్న హానర్ ల్యాబ్ బృందం

క్యాంపస్ ఇంటర్వ్యూకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో పూణేకు చెందిన హానర్ ల్యాబ్ లిమిటెడ్ ఆధ్వర్యాన శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారికి పూణే నుంచి వచ్చిన ఆరుగురు సభ్యుల కమిటీ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. బిటెక్ మెకానికల్, ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎంఎస్‌సి ఆర్గానిక్, అనలిటికల్ బిఎస్‌సి, బికాం, బిఎ పాలిటెక్నిక్, ఐటిఐ పాసైన అభ్యర్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి రాజేంద్ర మాట్లాడుతూ హానర్ ల్యాబ్ లిమిటెడ్ వివిధ బ్రాంచీల్లో పలు విభాగాల్లో పెద్ద ఎత్తున మానవ వనరుల అవసరం ఉందని అన్నారు. దీని కోసం ఏటా ఇటువంటి ప్రాంగణ ఎంపికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో ఆదిత్య కళాశాల సిఇఒ ఎంఎస్ఎస్ గుప్తా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ నాయుడు, శైలజ, రమేష్‌నాయుడు, నిరంజన్ శతపతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.నరేష్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న మీనాక్షి

వారంలో ఆరోగ్య పరీక్షలు పూర్తి

డిఎంహెచ్ఒ మీనాక్షి

పొందూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇంటింటా సర్వే జరిపి వారంలో ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలని డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. మండలంలోని తోలాపిలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం ద్వారా అవసరాన్ని బట్టి ఏడు పరీక్షలు చేపట్టాలన్నారు. నవంబరు 2లోగా ఈ కార్యక్రమం పూర్తికావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మల్లీశ్వరమ్మ, కార్యక్రమం పరిశీలకులు జి.సన్యాసిరావు, పిహెచ్ఎన్ సూర్యకుమారి, ఇఒ సురేష్, ఎఎన్ఎంలు రాజ్యం, లీలాకుమారి, భారతి, ఎంఎల్‌హెచ్‌పిలు రజని, ఆశా, శ్రావణి, హెల్త్ అసిస్టెంట్లు మన్మథరావు, ధనారావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఐసిఐసిఐ బ్యాంకు ఆధ్వర్యాన శనివారం చేపట్టిన జాబ్‌మేళా విజయవంతమైంది. డిగ్రీ చదివిన సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ప్రారంభించారు. ఆదివారం జరగబోయే ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా ఆభ్యర్థులను ఎంపిక చేస్తామని నిర్వాహకులు ఎం.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, జి.కసవయ్య, సిహెచ్.భవాని పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

పొలాకి : సకల శుభాలకు ఆది దైవం వినాయకుడని చవితి సందర్భంగా అందరికీ మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కష్ణదాస్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి కార్యసాధనకు కర్తవ్యాన్ని బోధించే వినాయకుడని పూజలను అందరూ కుటుంబ సమేతంగా నిర్వహించుకోవాలని అభిలాషించారు. చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయని కృష్ణదాస్ అన్నారు.

ముగిసిన క్రీడా ఎంపికలు

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా మైదానంలో నియోజకవర్గస్థాయి పాఠశాల క్రీడాకారుల ఎంపికలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీలకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 210 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ క్రీడా అంశాల్లో ఎంపిక చేపట్టగా, 90 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త కె.పద్మనాభరెడ్డి, ఎంఎస్ఒలు వజీర అహ్మద్, కార్తీక్ చౌదరి, పండ పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

జలుమూరు : మండలంలోని తిమడాం, కొమనాపల్లి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను ఐసిడిఎస్ అధికారులు భర్తీ చేశారు. ఈ మేరకు ఎంపికైన తిమడాం ఆయా పుట్టి శెట్టి రోహిణి, కొమనాపల్లి ఆయా కె.లీలావతిలకు శనివారం ఎంపిపి వాన గోపి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సారవకోట ఐసిడిఎస్ పిఒ హెచ్‌కె కామాక్షి, కొమనాపల్లి, తిమడాం సర్పంచులు కనుసు సీతమ్మ, వెలమల సత్యవతి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు మన్మథరావు పాల్గొన్నారు.

స్టార్టప్‌లపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యాంజలి, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా నిర్వహించే ఒక్కరోజుఆన్లైన్ సదస్సులో 'క్రియేటింగ్ స్టార్టప్-ఎకోసిస్టమ్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్' అనే అంశంపై 200 మంది మహిళా విద్యార్థులకు మద్రాస్ యూనివర్శిటీ ఎంబిఎ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎస్.మంజుల అవగాహనా సదస్సు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఉత్పత్తులపై

శిక్షణ ఇస్తున్న మంజుల

హక్కులు పొందే చట్టాల కోసం వివరించారని, అలాగే వ్యాపారాభివృద్ధికి లింగభేదం అడ్డురాదని, కావలసిన లక్షణం వ్యాపారంలో మెళకువలు తెలుసుకోడంపై డాక్టర్ పి.ఎస్.మంజుల వివరించారన్నారు. ఈ సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఒడి డాక్టర్ బి.శివకుమార్, అధ్యాపక బందం ఎస్.భాస్కర బాబు, డి.ప్రణయ, జె.సురేష్ కుమార్ తదితరులు ఈ సదస్సును పర్యవేక్షించారు.

ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో శనివారం ఘనంగా ఫ్రెష్‌ర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా డైరెక్టర్ జగదీశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్య, క్రీడల్లో, యోగాలో అన్నింటిలోనూ ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణచౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, సివిల్ విభాగపతి తేజ్‌కిరణ్, పిఆర్ఒమామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

రామన్నపేటలో 'పొలంబడి'

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాలవలస రైతు భరోసా కేంద్రం పరిధి రామన్నపేటలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పొలాల్లో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. పొలంబడితో పాటు శిక్షణ, జిల్లేడు ఆకు కషాయం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ రైతు శిక్షణ

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కేంద్రం ఎడిఎ వెంకటరావు, ఎఒ సూర్యకుమారి, ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం రేవతి, మండల ఎఒ వి.రాజేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు హేమలత పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు విస్తృతం

షీలా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షీలా

నేత్రాలను పరీక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షీలా

ప్రజాశక్తి- సోంపేట

మారుమూర గ్రామీణ ప్రాంతాలకు సైతం తమ ఆస్పత్రి ఆధ్వర్యాన నేత్ర వైద్య సేవలను విస్తృతం చేస్తామని పట్టణంలోని షీలా నేత్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ షీలా తంగరాజ్ తెలిపారు. 33 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల కంటి వైద్య పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తామని అన్నారు. ప్రత్యేకమైన రోజుల్లో విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, సైనిక ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలను సైతం అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు, ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. అలాగే శస్త్ర చికిత్సల సైతం చేస్తున్నామన్నారు. దృష్టిలోపం, గ్లాకోమా, మెల్లకన్ను వంటి నేత్ర సంబంధిత సమస్యలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలకే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోంపేట, ఇచ్ఛాపురం, పలాస పట్టణాల్లో బ్రాంచీలను నిర్వహిస్తున్నామని, పరిసర ప్రాంత ప్రజలు తమ ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మండల సమావేశంలో నిరసన సెగ

బహిష్కరించిన టిడిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశాన్ని టిడిపి ఎంపీటీసీలు, సర్పంచులు బహిష్కరించారు. సమావేశం ప్రారంభం కాగానే టిడిపి సభ్యులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయంలో ఫ్ల కార్డులు పట్టుకుని చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని, 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. ఈ దశలో జడ్పిటిసి సభ్యుడు బెండి గోవిందరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామమూర్తి కలుగజేసుకొని చంద్రబాబు అరెస్టు న్యాయస్థానం పరిధిలో ఉందని, ఏమైనా ప్రజల సమస్యలుంటే ఇక్కడ చర్చించాలని సమయాన్ని వృథా చేయవద్దని కోరారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ సమావేశ మందిరం నుండి టిడిపి ఎంపీటీసీలు, సర్పంచులు బయటకు వచ్చి సమావేశ మందిరం ముందు బైఠాయించారు. అనంతరం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, తొందర్లోనే ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించి అక్కడనుండి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బొడ్డేపల్లి సుగుణ, జి రాజేశ్వరి, సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, నేతింటి జ్యోతీశ్వరరావు, సనపల చెల్లం నాయుడు, గొండు రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న టిడిపి సభ్యులు

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధ్యమని డాక్టర్ దానేటి శ్రీధర్ పేర్కొన్నారు. నగరంలోని కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజ్‌లో గ్లోబల్ ఎంప్లాయిమెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా పేరు సంపాదించుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ తన అభివృద్ధికి కారుకులైన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. విద్యార్థులందరూ లక్ష్యాలని నిర్ధేశించుకుని ముందుకు సాగాలన్నారు.

శ్రీధర్‌ను సన్మానిస్తున్న స్కూళ్ల యజమానులు

అనంతరం శ్రీధర్‌కు స్కూల్ యాజమాన్యం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం, శ్రీశ్రీ ఫౌండేషన్ శ్రీకాంత్, కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రావు సద్గున్, ఇన్‌ఛార్జి రామారావు పాల్గొన్నారు.

నేడు 'నాగావళి గలగలలు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో ఈ నెల 17న సాయంత్రం 5.45 గంటలకు నాగావళి గలగలలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గోవిందరాజులు ట్రస్టు సభ్యులు కొంక్యాన వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన నారీభేరీ సంస్థ, శ్రీకాకుళంలోని సుకుమార్ ఆర్కెస్ట్రా సంయుక్తంగా ఘంటశాల, ఎస్.పి.బాలు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నారీభేరీ సంస్థ ప్రతినిధులు, మహిళా గాయకులు కింతలి భ్యాగలక్ష్మి, సి.వి.రాజేశ్వరి, శైలజమెరాజ్ పాల్గొంటారని అన్నారు. సుకుమార్ ఆర్కెస్ట్రా ప్రతినిధులు బండారు చిట్టిబాబు, డాక్టర్ నిక్కు అప్పన్న నేతృత్వాన జరిగే సంగీత విభావరి కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు, శక్తి ఎంపవరింగ్ అసోసియేషన్ ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పాల్గొంటారని చెప్పారు. నగరంలోని ఔత్సాహికులు, శ్రోతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రబాబు కుంభకోణాలపై పవన్ స్పందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టిడిపి హయాంలో జరిగిన అమరావతి భూ కుంబకోణం, ఓటుకు నోటు, ఇసుక దోపిడీ, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఎందుకు ప్రశ్నించడం లేదని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కు పలు ప్రశ్నలు వేశారు. ఒక్క ఎమ్మెల్యేగా కూడా గెలవక ముందే ఇన్ని పార్టీలతో పొత్తులు అంటే... మీ పార్టీకి ఉన్న విధి విధానాలు ఏమిటో చెప్పగలరా? అని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణాల్లో అవకతవకలు జరిగి రూ.118 కోట్లు చంద్రబాబుకు ముడుపులు అందాయని ఇన్కమ్ టాక్స్ నోటీసులుఇస్తే మీరు దానిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

నరసన్నపేటలో శిష్టికరణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, బుడితి జెపిటి పాఠశాల అధినేత మోహన్ గాంధీ, సిఎంఆర్ సంస్థ మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.

కవిటిలో ఆర్ష విజ్ఞాన భారతి కరస్పాండెంట్ పూడి రామారావు విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్పు అనిల్, ఆరింగి వెంకటరావు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ, రోటరీ క్లబ్ నిర్వాహకులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

మండలంలోని చీమలవలసలో అమ్మ ఆలయం ట్రస్టు చైర్మన్ సనపల శ్రావణ్ కుమార్ పట్టణంలోని కొత్తకోట వారి వీధి, మున్సిపల్ కాంప్లెక్స్, వన్ వే కూడలి, ఆర్‌టిసి కాంప్లెక్స్, గేట్ సెంటర్, వైఎస్ఆర్ సర్కిల్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సనపల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, రైతు బజార్, డేఅండ్‌నైట్, ఏడు రోడ్లు, సూర్యమహల్ కూడళ్లల్లో కాలుష్యంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యాన సంబంధిత అధికారి ఎ.రామరావు, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఇఇ రామారావు నాయుడులు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

టెక్కలి మండలం చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి విగ్రహాలను పంపిణీ చేసి అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న శ్రావణ్‌కుమార్

సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు మెయిన్ రోడ్‌లో స్టాల్ ఏర్పాటు చేసి ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జిఒ హోమ్ ఆవరణలో చేయూత మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షులు వైశ్యరాజు వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షులు కోరాడ హరిగోపాల్, సభ్యులు బెల్లాన కళ్యాణ్, కొండబాబు, కోట్ని లింగరాజు, మణిశర్మ, పూర్ణ, బాలామణి, సంగీత, ద్రాక్ష మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కెటి రోడ్డు పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తాం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ విస్తరణ పనులు పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 27 వార్డులో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడగి తెలుసుకున్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందక పోతే తక్షణమే మంజూరు చేస్తామన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అతి త్వరలో కిడ్నీ ఆసుపత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేస్తామని చెప్పారు. రైల్వే వంతెన పనులను గత ప్రభుత్వం విస్మరించిందని, తాను ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కష్ణారావు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, వార్డు ఇన్ఛార్జి సుడియా సురేష్, పలాస ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవాని శంకర్, విప్ దుర్గాశంకర్ పండా, కో ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్.విభాగంలో ఆంగ్ల అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న కోరెడ్డి విజయలక్ష్మి రచించిన 'ఆరిజన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అప్రోచెస్ అండ్ మెథడ్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ పుస్తకం ద్వారా భాష పుట్టుక, దాని ఆవశ్యకత, భాష విధానం, భోధనా పద్ధతులు, సమాజ అవసరాలకు అనుగుణంగా మార్పు చెందే విధానంపై చక్కటి అవగాహన పెంచుకొనే అవకాశం కలుగుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు. భాషను మనోవిజ్ఞాన వేత్తలు, భాషాకోవిదులు ఎలా సృష్టించారో రచయిత విశ్లేషించారని ఆయన తెలిపారు. ఆంగ్ల భాషాభివృద్ధికి అవసరమైన మరిన్ని పుస్తకాలను రచించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బిఎస్ అండ్హెచ్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.శాంతికుమార్లు రచయిత కోరెడ్డి విజయలక్ష్మిని అభినందిస్తూ కోరారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది ఆమెను అభినందించారు.

టెక్కలి : మట్టి విగ్రహాలను పరిశీలిస్తున్న పగడాలమ్మ

మట్టి విగ్రహాల తయారీపై పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : చిట్టి బుర్రలలోని సృజనాత్మకతకు వెలికితీస్తూ చిన్నారి చేతుల్లో మట్టి గణపతులు రూపుదిద్దడానికి ఆశాదీపిక ఫౌండేషన్ నగరంలోని పిఎస్ఎన్ ఎం స్కూలక్లో శనివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొని మాట్లాడారు. చిన్నారుల సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా భావితరాలకు మంచి సందేశాన్ని అందించారన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనే థీమ్‌తో ప్రారంభించిన ఈ పోటీల్లో సృజనాత్మకతతో పాటు చాతుర్యాన్ని, నైపుణ్యతను వెలికితీశామని చెప్పారు. ఆశా దీపిక ఫౌండేషన్ చైర్‌పర్సన్ నల్లి ఆశాదీపిక మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తరపున పిల్లలకు మట్టి గణపతులకు అవసరమైన సామగ్రిని అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నల్లి రవికుమార్, స్టార్ వాకర్స్ అధ్యక్షులు జోగినాయుడు, డోల అప్పన్న, ప్రవీణ్, అప్పికొండ మోహనరావు, విజయలక్ష్మి, వెంకటరమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు : పొందూరు మానసవేణి హైస్కూల్‌లో విద్యార్థులకు మట్టి వినాయకుల ప్రతిమల తయారీపై కరస్పాండెంట్ ఎంఆర్‌ఆర్‌సిహెచ్.కుమార్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు వినాయక చవిత సందర్భంగా మట్టి వినాయకుల ప్రతిమలనే అందరూ వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రతిమలను బాగా తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

టెక్కలి: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు వీలుగా ఆవసరమైన విజ్ఞానాన్ని విద్యార్థి దశ నుంచే ఆలవాటు చేసుకోవాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ అభిప్రాయపడ్డారు. మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకుల ప్రదర్శనని శనివారం పరిశీలించారు. అంతకుముందు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గదికి వెళ్లి వారి జ్ఞానాన్ని పరిశీలించారు. ఫలితాలు మెరుగులో ఉపాధ్యాయులు, సిబ్బంది చూపిన కృషిని కొనియాడారు. ఫలితాల మెరుగుకు తీసుకుంటున్న ప్రణాళిక, కార్యాచరణపై ప్రధానోపాధ్యాయురాలు సత్తారు వేణికుమారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోణంకి గౌరీప్రసాద్, సంపతరావు వాసుదేవరావు, లక్ష్మణరాజా, మోదుగువలస రమాదేవి, సునీత, జ్యోతీకుమారి, హేమలత, నరేష్ పాల్గొన్నారు.

ఫాస్టర్లకు గౌరవ వేతనం విడుదల

ఇచ్ఛాపురం : పాస్టర్లకు బకాయి పడిన ఐదు నెలల గౌరవ వేతనం శనివారం ఒకేసారి విడుదలైందని క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రతి అన్వేషి తెలిపారు. జిల్లాలో మొత్తం 106 మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తుందనిపేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే వారికీ మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈయన వెంట క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు. జాన్ డేవిడ్ ఉన్నారు.

అర్హులకు పింఛన్లు

పలాస: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నామని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు అన్నారు. మండలంలోని రెంటికోట పంచాయితీ పరిధిలో నూతనంగా మంజూరైన 30 మందికి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సద్గుణ నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్య పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి

కోటబొమ్మాళి : నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజు కోరారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవం సందర్భంగా శనివారం సమావేశం నిర్వహించారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో చిగురువలస కనకరాజు, హరీష్, వీరాస్వామి, తెలగవలస మోహనరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం

టెక్కలి : సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రిస్తూ... పర్యావరణ సమతుల్యతను కాపాడుకుందామని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రి ఆధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎ.రామారావు, లూక్‌పాల్, కంచరాన శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.రమాదేవి ఆధ్వర్యాన వినీషా, రక్షితలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి, వాసుదేవ్, రోణంకి గౌరీప్రసాద్ పాల్గొన్నారు. నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బడగల ప్రమీళ ఆధ్వర్యాన విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ధర్మారావు, చిన్నవాడు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. భూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు కె.అచ్యుతరావు ఆధ్వర్యాన వివిధ పోటీలు నిర్వహించారు.

టెక్కలి : ఛార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు తులసీప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, రంకిడి రామారావు, బెందాళం రత్నం, బివివికె ప్రియదర్శిని, గోవిందరాజు, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని మురపాక కస్తూరిబా గాంధీ బాలికలు పాఠశాలలో ఓజోన్ డే సందర్భంగా విద్యార్థినులతో ఇలా ఆకృతిలో వలయం లా ఏర్పడ్డారు. కార్యక్రమం పాఠశాల ప్రత్యేకాధికారి బల్లా సుధారాణి పాల్గొన్నారు.

పలాస : మానవ మనుగడకు ప్రకతి ఎంతో దోహదపడుతుందని, దానిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌వి రమణరావు అన్నారు. శనివారం ప్రపంచ ఓజోన్ సంరక్షణ దినోత్సవం సందర్భంగా జాతీయ హరితదళ క్లబ్ జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్‌సి ప్రాంతీయ సమన్వయకర్త బొయ్యల శ్రీనివాసరావు, తులసీరాణి తదితరులు పాల్గొన్నారు. విశాలాంధ్ర- కాశీబుగ్గ ప్రపంచ ఓజోన్ సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఓజోన్ దినం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. దానరది మాట్లాడారు.

శ్రీకాకుళం అర్బన్ : కాలుష్య నియంత్రణతో పాటు పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పేర్కొన్నారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రసాయనిక విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ శాంతిప్రియ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జలో రూ.2.29 కోట్ల నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయి నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. అనంతరం మండలంలోని చిన్నలంకంలో రూ.72 లక్షలు, పెద్లంకాంలో రూ.51 లక్షలు, మామిడివలసలో రూ.66 లక్షలు, కాఖండ్యంలో రూ.40 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మండల పార్టీ కన్వీనర్ వెంకటరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు చీర ప్రభావతి, కాగితపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

బూర్జ : శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

జలుమూరు: మండలంలోని అక్కురాడ పంచాయతీలో ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు ఎంపిపి వాన గోపి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్యకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న పోర్టు వాహనం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలో కొత్తలింగూడు - రాజపురం రహదారిలో విద్యుత్ స్తంభాన్ని పోర్టు వాహనం శనివారం సాయంత్రం బలంగా ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నాలుగు గంటల పాటు నిలిచిపోయింది. మండలంలోని పీడర్లో ఉన్న మూలపేట, కొత్తలింగూడు, రాజపురం, పాతమేమవరం, ఆకాశలక్కవరం హనుమంతునాయుడు పేట, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడంతో ఆప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు వచ్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. అయితే మూలపేట పోర్టు కోసం రాళ్ల తరలిస్తున్న టిప్పరు వాహనాలు తరుచుగా విద్యుత్ స్తంభాలు ఢీకొనతుండంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నిలదీస్తున్న చైర్మన్ సూర్యనారాయణ

మండల సమావేశం రసాభాస

ప్రజాశక్తి- కొత్తూరు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశం రసాభాసగా సాగింది. పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణను స్టేజ్‌పైకి ఆహ్వానించకపోవడంతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రూపునకు చెందిన సభ్యులు ఎంపిపిని నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే, వైసిపి గ్రూపుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అయినా ఆహ్వానించకపోవడంతో పిఎసిఎస్ చైర్మన్ సభను బహిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశం ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు ఎరువులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయలేదని సభ్యులు కొయిలాపు శ్రీనివాసరావు ఎఇ శ్రీనివాసరావును ప్రశ్నించారు. సకాంలో ఎరువులు అందకపోవడంతో రైతులు ప్రశయివేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయేతర భూములకు ఇకెవైసి చేయడం లేదని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉపాధి పనులు చేస్తున్న సమయంలో సంబంధిత అధికారులు పరిశీలించడం లేదని ఎపిఒ ప్రేమలతను ప్రశ్నించారు. మస్తర్లు వేసి వెళ్లిపోతున్నారని, ఎంత పని జరిగింది, ఎంత మంది కూలీలు వస్తున్నారు అనే విషయం పరిశీలించడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు లేవని సూపర్‌వైజర్ లింగాల శాంతికుమారిని నిలదీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, వైస్ ఎంపిపిలు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, మెండ సునీత, ఎంపిడిఒ ఎం.సావిత్రి, ప్రత్యేకాహ్వానిలు అంపిలి ప్రశాంత్‌కుమార్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి గోపి

ఆరోగ్య సురక్ష అవగాహన

ప్రజాశక్తి- జలుమూరు

జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. శనివారం మండలంలోని కొమనాపల్లి, మర్రివలస, శ్రీముఖలింగం, అక్కురాడ సచివాలయాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి సంబంధిత యాప్‌ను వారి మొబైల్ ఫోన్లో ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు దామ మన్మథరావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్ మోహన్ రావు, ఆయా సచివాలయాల పరిధిలోని సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు రష్మీ ఎంపిక

బూర్జ: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని ఒవి పేట మోడల్ స్కూల్ విద్యార్థిని పైల రష్మీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, పిఇటి జి. రామ్మూర్తిలు తెలిపారు. మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పైల రష్మి అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈమె పదో తరగతి చదువుతున్న సమయంలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నుంచి మూడుసార్లు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు.

పనుల్లో వివక్షపై నిలదీత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో మూడు వార్డులు రత్తకన్నలో అభివృద్ధి పనులు చేపట్టడంతో వివక్షత చూపిస్తున్నారని వార్డు కౌన్సిలర్లు సిహెచ్.జగన్, భూలక్ష్మి, తాడి ఆదిరెడ్డి కమిషనర్ రమేష్‌ను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల అభివృద్ధిలో ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ వార్డులోనూ ఇదే పరిస్థితి నెలకొందని మూడో వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య ప్రశ్నించారు. వార్డు కౌన్సిలర్‌కు తెలియకుండా పనులు కేటాయింపు ఎలా చేపడతారని అన్నారు. ఆరో వార్డు కౌన్సిలర్ మంజులతా తమ వార్డులో అభివృద్ధి పనులకూ నిర్లక్షం చూపుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. చిన్న చినుకు పడితే చాలు బురదమయం అవుతుందని అన్నారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ... పనులు చేపట్టడంలో ఎటువంటి వివక్షతా లేదని, టెండర్ దశలో ఉన్నా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో వార్డు కౌన్సిలర్లు శాంతించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు వచ్చిన టెండర్లను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణ మణి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్ పాల్గొన్నారు.

నిలదీస్తున్న కౌన్సిలర్లు

చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

జోగారావు చిత్రపటం ఆవిష్కరణ

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ తట్టికోట జోగారావు చిత్రపటాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జోగారావు చూపిన చొరవ ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జోగారావు కుటుంబ సభ్యులు సంతోష్, మాలతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యపకులు ఎ.రామారావు, వాసుబాబు, త్రినాథరావు, కసవయ్య, పీడీ సత్యనారాయణ చెందు లక్ష్మి, టంకాల బాలగంగాధర్ తుప్ప పాల్గొన్నారు.

సేకరించిన వ్యర్థాలతో ఎంఎస్ఎస్, ఐఎన్‌సిఒఐఎస్ ప్రతినిధులు

వ్యర్థాలతో అనర్థాలెన్నో...

కవిటి : తీరప్రాంతాల్లోని వ్యర్థాలతో నదీ జలాలు కలుషితమై అనేక అనర్థాలు కలుగుతున్నాయని మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు బి. దాలయ్య, కార్యదర్శి జలుమూరు సత్యం అన్నారు. స్వచ్ఛ సాగర్ - సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా కవిటి మండలం ఇద్దివానిపాలెం సముద్ర తీరంలో శనివారం వ్యర్థాలు, ప్లాస్టిక్ శుభ్రం చేశారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఐ.ఎన్.సి.ఒ.ఐ.ఎస్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 కేజీలకు పైబడి వ్యర్థాలు, ప్లాస్టిక్ సేకరించారు. అనంతరం దాలయ్య, సత్యం మాట్లాడుతూ ప్రపంచ సముద్రతీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా దేశంలోని 350 తీరప్రాంత గ్రామాల్లో సెప్టెంబర్ 16,17 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామికీకరణ పేరుతో సముద్ర జలాలు కలుషితమై అనేక ఉపద్రవాలు ముంచుకొస్తున్నాయని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక్క రోజులోనే, ఒక్క గ్రామంలోనే 200 కేజీలకు పైబడి వ్యర్థాలు సేకరించామంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు స్థానికులు సహకరించి పర్యావరణ పరిరక్షణతోపాటు సముద్ర తీర పరిరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.రాము, ఐ.ఎన్.సి.ఒ.ఐ.ఎస్. సంస్థ ప్రతినిధులు భరత్, శివకుమార్, మత్స్యకార సంక్షేమ సమితి ప్రతినిధి కె.లచ్చయ్య, ఎఫ్‌డిఒ ముసలయ్య, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల సమావేశంలో పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, తోటాడ సర్పంచ్ మెట్ట శారదలు మాట్లాడుతూ తమ గ్రామాల్లో ఉన్న మండల పరిషత్ అప్పర్ ప్రైమరి పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి గెడ్డాపు రాజేంద్రప్రసాద్‌ను కోరారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాల్లో భాగంగా రేషనలైజేషన్ ప్రక్రియలో ఈ విధమైన ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. ఉపాధ్యాయులను నియమించే అధికారం జిల్లా విద్యాశాఖ అధికారిదేనని, ఆయన దష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను తొందర్లోనే పరిష్కరించి ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు. గ్రామాలలో విద్యుత్ స్తంభాలు వేయాలని స్పీకర్ చెప్పి రెండు నెలలు కావస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు నేటికీ వేయలేదని ఎలక్ట్రికల్ ఎఇను రామచంద్రపురం తోటాడ సభ్యుల ప్రతినిధులు ప్రశ్నించారు. ఒక్కో విద్యుత్ స్తంభానికి రూ.35 వేలు చొప్పున విద్యుత్ శాఖకు కట్టాలని ప్రస్తుతం ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయలేదని, చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో చనిపోయిన పశువులకు ఇన్సూరెన్స్ వర్తించడం లేదని అదే అర్బన్ లో చనిపోయిన పశువులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇక్కడ వర్తించి అక్కడ వర్తించకపోవడానికి కారణాలు ఏమిటని స్పీకర్ సతీమణి తొగరం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ కొత్తవలస పశు వైద్యాధికారి ఓంకార్‌ను ప్రశ్నించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండల అధికారులు కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకు ఉండడం లేదని, మధ్యలోనే వెళ్లిపోతున్నారని, ఇది తగదని ఇకనుంచి ఎవరైనా అధికారులు మధ్యలో వెళ్లిపోతే పూర్తి సమాచారాన్ని తనకు ఇవ్వాలని ఎంపీడీవో ఎస్. వాసుదేవరావును సూచించారు. ఎంపీటీసీలు సర్పంచ్ సభ్యుల సతుల స్థానంలో పతులు వచ్చి సమావేశంలో పాల్గొని సభ్యుల బదులు వీరే సంతకాల పెడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బెండి గోవిందరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీటీసీలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీని నిర్వహిస్తున్న నాయకులు

పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశ్రభంగా ఉంచుకోవాలి, అప్పుడే ఆరోగ్య రక్షణ లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ అధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పర్యవేక్షణలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చెత్త రహిత, నిషేధిత ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దిందుకు ముందుకు రావాలని అన్నారు. అనంతరం వైస్ చైర్మన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణ మణి, చైర్ పర్సన్ రాజ్యలక్ష్మితో కలిసి మున్సిపల్ ఆవరణలో రోడ్లు శుభ్రపరిచారు.. యూత్ గార్బేజ్ ర్యాలీ సందర్భంగా కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సెల్ ్లు, సచివాలయం మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు జనం నీరాజనం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాలలో ప్రతి గడపకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు జనం నీరాజనం పడుతున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలోని గాజుల కొల్లివలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మినేని శ్రీరామ్ మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మొండేటి సుజాత, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే సంక్షేమ ఫలాలు

శ్రీకాకుళం అర్బన్ : లబ్ధిదారులకు నేరుగా ఇంటివద్దకే సంక్షేమ పథకాల ఫలాలను ప్రభుత్వం అందజేస్తుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఫాజుల్ బేగ్‌పేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి హయాంలో దళారులు, జన్మభూమి కమిటీల ప్రమేయంతో పథకాలు అర్హులైన అందరికీ అందేవి కాదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సర్ ఎం.వి.పద్మావతి, నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

పోలాకి : గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం చేయడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ధర్మాన కష్ణదాస్ అన్నారు. శనివారం గంగివలస, మౌగిల్లి పేట, కొండలక్కివలస గ్రామాలలో 165వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వివరాలు ప్రజలకు తెలిపారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి సిఇసి సభ్యులు ధర్మాన పద్మప్రియ, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న విజయ

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

కొత్తూరు : కొత్తూరు జెడ్‌పిటిసి కామాక భాగ్యవతి భర్త త్రినాథరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ భాగ్యవతిని శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు.

సిరిపురం...

మెళియాపుట్టి : మండలంలో సుందరాడ గ్రామంలో శనివారం విద్యావేత్త నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు పర్యటించారు. గ్రామానికి చెందిన పడాల సుందరమ్మ ఇటీవల మతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మాజీ ఎంపీటీసీ ఎస్.యల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం మామిడి, కొబ్బరి, పనస, సపోట, జామ తదితర మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ భావితరాలకు చక్కని, తియ్యని ఫలాలు అందిస్తాయని అన్నారు. ఇంటర్ విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలు పి.కష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు లక్ష్మణరావు, సూర్య ప్రకాష్ మాలతి, స్రవంతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- నందిగాం

వరుసగా నాలుగు సంవత్సరాలు కాపు నేస్తం అందించినందుకు కతజ్ఞతగా నందిగాం పంచాయతీకి చెందిన పలువురు మహిళలు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, ఉప సర్పంచ్ సన్యాసిరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ నిరంజన్. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డొంకలపర్తలో ఆరోగ్య సురక్ష

బూర్జ : మండలంలోని డొంకలపర్తలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని హెల్త్ సూపర్‌వైజర్ టి.తేజేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి టి.రాధిక, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండో దశలో బిపి, సుగర్, హిమోగ్లోబిన్ యూరిన్ స్కూటర్ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంల ఎఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు రాణి, రూప పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది